క్లుప్తంగా

జూట్ బ్యాగుల తయారీలో శిక్షణ

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని గ్లోబల్ ట్రస్ట్ కార్యాలయంలో కెనరా బ్యాంక్ స్వయం ఉపాధి శిక్షణలో భాగంగా మహిళలకు ఉచితంగా జూట్‌బ్యాగ్‌ల తయారీలో శిక్షణ ఇస్తున్నట్లు ట్రస్టు చైర్మన్ సారథి శుక్రవారం తెలిపారు. ఆసక్తి కలిగిన మహిళలు కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

చిన్నమండెం : మండల పరిధిలోని సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు ఈ నెల 12వ తేదీ నుంచి 14వ తేదీల వరకు మూడు రోజులపాటు శిక్షణా కార్యక్రమాలు ఉంటాయని ఎంపీడీఓ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయిలో జరుగు ఈ శిక్షణా కార్యక్రమానికి సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తప్పక హాజరుకావాలని ఆయన తెలియజేశారు.

నీటి సమస్య పరిష్కరించండి

సిద్దవటం : మండలంలోని పెద్దపల్లె గ్రామ పంచాయతీ భాకరాపేట సమీపంలో ఉన్న మలినేనిపట్నం కాలనీలో కొంత కాలంగా తాగునీటి సమస్య నెలకొందని సమస్యను పరిష్కరించాలని ముంపు వాసుల సొసైటీ అధ్యక్షుడు బ్రహ్మారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ మలినేనిపట్నంలో కాలనీ ప్రారంభించినప్పుడు రెండు బోర్లు, రెండు మోటార్లను ఏర్పాటు చేశామన్నారు. గత కొన్ని రోజుల కిందట ఒక బోరు మరమ్మతుకు గురైయిందన్నారు. దీంతో కాలనీలో నీటి సమస్య ఏర్పడిందని, అధికారులు బోరు, మోటారు, పైప్‌లైన్‌లను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

సజ్జ సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఓబులవారిపల్లె : సజ్జ సాగులో సరైన సమయంలో నీటి తడులు అందించి యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏడీఏ కవిత రైతులకు అవగాహన కల్పించారు. శుక్రవారం గోవిందంపల్లి పంచాయతీలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సజ్జపంటను పరిశీలించి సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులు సజ్జలో పసుపు రంగు తెగులు నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి మల్లిక, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రం ఉపయోగకరం

వీరబల్లి : సంపద తయారీ కేంద్రం రైతులకు ఎంతో ఉపయోగకరమని ఎంపీడీఓ రామచంద్రారెడ్డి తెలిపారు. మట్లి గ్రామంలో ఏర్పాటు చేస్తున్న సంపద తయారీ కేంద్రానికి కావాల్సిన మరమ్మతులను శుక్రవారం ఎంపీడీఓ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా అక్కడి రైతులు, ప్రజలతో ఆయన మాట్లాడుతూ పాడి చెత్త, తడి చెత్త ద్వారా సంపదను తయారు చేయవచ్చని తెలిపారు. చెత్త నుంచి ఎరువులను తయారు చేసి ఆ గ్రామంలోని రైతులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌బ్ల్యూఎస్ ఏఈ కృష్ణయ్య, ఏపీఓ నాగరాజు, కార్యదర్శి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

పెనగలూరు : ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుమ్మల రాధాకృష్ణ, సాంబశివలు డిమాండ్ చేశారు. శుక్రవారం బెస్తపల్లిలో ఆటో డ్రైవర్లతో భారీగా ర్యాలీ, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో నూతన క్రిమినల్ చట్టాలను ప్రభుత్వం రద్దు చేయాలని కోరారు. ఆటోలు నిలుపుకోవడానికి ప్రత్యేకంగా స్థలాలు ఏర్పాటు చేయాలన్నారు.

హోటళ్లు, షాప్‌ల యాజమానులకు జరిమానా

రాయచోటి (జగదాంబ సెంటర్) : నాణ్యతా ప్రమాణాలు పాటించని హోటళ్ల యజమానులపై జిల్లా అధికారులు ఉక్కుపాదం మోపారు. జిల్లా కేంద్రంలో హోటళ్లలో వంట నూనె వినియోగంలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో హోటళ్ల యాజమానులు, గడువు ముగిసిన వాటిని విక్రయించడంతో సూపర్ మార్కెట్, పాల డైరీ యాజమానులు మొత్తం ఆరుగురిపై జిల్లా కలెక్టర్ రూ.60 వేల జరిమానా విధించినట్టు జిల్లా ఆహార భద్రతా అధికారి డా.కె.షమీమ్‌బాషా తెలిపారు.

గ్రామంలో పారిశుధ్య పనులు

సిద్దవటం : మూలపల్లె గ్రామ పంచాయతీలో శుక్రవారం పారిశుధ్య పనులు చేపట్టినట్లు సర్పంచ్ ఆవుల వెంకటసుబ్బమ్మ తెలిపారు. ఈ సందర్భంగా మూలపల్లెలో ఆమె మాట్లాడుతూ మా గ్రామ పంచాయతీలో ప్రజలకు మౌలిక వసతులను కల్పిస్తున్నామని ముఖ్యంగా తాగు నీరు, వీధి దీపాలు, ఏర్పాటు చేశామన్నారు.

రాజంపేటకు విచ్చేసిన కర్నూల్ రేంజ్ డీఐజీ

రాజంపేట : కర్నూల్ రేంజ్ డీఐజీ కె.ప్రవీణ్ కుమార్ గురువారం రాజంపేటకు విచ్చేశారు. ఈయన అన్నమయ్య అతిథి గృహం వద్ద పోలీస్ అధికారులు స్వాగతం పలికారు. తిరుపతికి వెళ్తూ మార్గమధ్యలో కొద్దిసేపు అతిథి గృహంలో సేదతీరారు. జిల్లా ఎస్పీ, ఇన్‌చార్జ్ డీఎస్పీ, పోలీసు అధికారులు పాల్గొన్నారు. అలానే రాజంపేట టౌన్ సీఐ మద్దయ్య ఆచారి ఆకస్మికంగా బదిలీ అయ్యారు. ఈయన్ను చిత్తూరు డీసీసీ డీసీఆర్‌బీకి బదిలీ చేశారు. ఇక్కడికి ఇంకా ఎవరికీ పోస్టింగ్ చేయలేదు.

ఉద్యాన రైతుకు ఊతమిచ్చేనా..!

- అరటి, బొప్పాయి పంటలు విస్తారంగా వేలాది ఎకరాలలో సాగు
- తెగుళ్లను అధిగమిస్తే మంచి దిగుబడి
- దళారీలు దరి చేరకుంటే ధరలు అధికం


రైతులు సాగు చేస్తున్న అరటి పంట

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు నియోజకవర్గంలోని రైతులు అరటి, బొప్పాయి పంటలపై గంపెడన్ని ఆశలు పెట్టుకొని ఏడాది పొడవునా వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తుంటారు. ఇక్కడి రైతులు అరటి, బొప్పాయి పంటలను చెమటోడ్చి పండిస్తూవున్నా గత మూడు సంవత్సరాలుగా అరటి, బొప్పాయి పంటలను వాతావరణ మార్పులు, ధరల తగ్గుదల రైతుల వెన్ను విరిచాయి. అయినా ప్రతి ఏడాది ఆ పంటలపైనే ఆధార పడుతూ ఉంటారు. రైతులందరూ ఈ పంటలపై కోటి ఆశలతో వేలాది ఎకరాలలో సాగు చేస్తూ ఉన్నారు. అరటిలో టిష్యూ కల్చర్, బొప్పాయిలో తైవాన్ మొలకలు సాగు చేయడానికి రైతులు ఎక్కువ మక్కువ చూపుతున్నారు. నియోజకవర్గంలోని కోడూరు, ఓబులవారిపల్లి, పుల్లంపేట, చిట్వేలి, పెనగలూరు మండలాలో అరటి, బొప్పాయి పంటను రైతులు ఎక్కువ సాగు చేస్తున్నారు. కోడూరులో టిష్యూకల్చర్ అరటి, బొప్పాయి పిలకల నర్సరీలు ఉన్నాయి. అన్ని గ్రామాల రైతులు ఇక్కడ నుంచే ఎక్కువ భాగం కొనుగోలు చేసి సాగు చేస్తున్నారు.

అధిక దిగుబడికి ఈ అంశాలు తప్పనిసరి

ఈ ప్రాంత రైతులకు ప్రతి యేడాది అరటి, బొప్పాయి పంటలకు రైతులకు మొక్కల ఎంపికలో విఫలం కావడం, పంట యాజమాన్యం సరిగా లేకపోవడంతో పంటకు సోకిన తెగుళ్ల రైతులకు నష్టాలనే మిగులుస్తున్నాయి. గత మూడు సంవత్సరాలుగా ప్రతి ఏడాది రైతును బొప్పాయి పంట రైతులను నిరుత్సాహానికి గురి చేస్తూవుంది. నులి పురుగు, వేరు కుళ్లు, ఆకుముడత, బూజు పురుగు తెగుళ్లు పంటను నాశనం చేస్తున్నాయి. వీటిని అధిగమిస్తే బొప్పాయి పంట వల్ల రైతుకు మూడు దశల్లో ఆదాయం వస్తుంది. బొప్పాయిపంట చేతికి వచ్చే దశలో తెగుళ్ల నుంచి కాపాడుకోగలిగి, మంచి ధరలు పలికితే రైతులకు ఎకరాకు లక్షపైనే ఆదాయం వస్తుంది.

దిగుబడి వచ్చినా మోసపోతున్న రైతన్న

రైతులు పండించిన అరటి, బొప్పాయి పంటలు మంచి దిగుబడి వచ్చినా వారు సొంతంగా మార్కెటింగ్ చేసుకొనే వసతులు లేకపోవడం, ఎక్కువ శాతం రైతులకు సొంతంగా పెట్టుబడి పెట్టే స్తోమత లేకపోవడంతో రైతులు స్థానిక వ్యాపారులనే ఆశ్రయిస్తుంటారు. ప్రతి ఏడాది ఇక్కడి నుంచి వ్యాపారం వందల కోట్లలో జరుగుతుంది. దీంతో ఇతర రాష్ట్రాల నుంచి వ్యాపారులు ఇక్కడ మకాం పెట్టి స్థానిక తళారీలతో వ్యాపారాలు సాగిస్తుంటారు. ఇదే అదునుగా రైతులకు, వ్యాపారులకు మధ్య దళారులు చేరి రైతన్నను శాంతం ముంచేస్తున్నాడు. చేతికి వచ్చిన పంటకు వ్యాపారులు ఒక రేటు తీసుకుంటుండగా రైతులకు తక్కువ రేటు ఇస్తున్నారు. దీనికి తోడు లోడ్ తూకాలలో కోత, కమీషన్ నిండా ముంచుతున్నాయి. వీటికి తోడు పెట్టుబడికి రైతులకు అధిక వడ్డీలకు డబ్బులిచ్చి రాబట్టడం ఇలా రకరాలుగా రైతును మోసం చేస్తూ సంపాదిస్తుంటారు. ఇక్కడ కొందరు దళారీ వ్యాపారులు పంట ధరలను శాసిస్తుంటారు.

నియోజకవర్గంలో అరటి, బొప్పాయి పంట అంచనా ఎకరాలలో...

మండలం	అరటి	బొప్పాయి
కోడూరు	2420	13000
ఓబులవారిపల్లి	1830	2462
పుల్లంపేట	2200	650
చిట్వేలి	838	1890
పెనగలూరు	295	315

ప్రతి ఏడాది అరటి సాగు చేస్తున్నా



గత 10 సంవత్సరాలుగా బొప్పాయి, అరటి పంటను పండిస్తున్నాను. అయితే ఈ ఏడాది లాగా నష్టాలు ఎప్పుడూ లేవు. ప్రస్తుతం నేను 5 ఎకరాలలో బొప్పాయి, 5 ఎకరాల్లో అరటిని సాగుచేస్తున్నాను. ఇప్పటికే ఖర్చు నాలుగు లక్షలు పై చిలుకు అయింది. కాని ప్రస్తుత ధరల ప్రకారం పెట్టుబడులు రావు. దళారీ వ్యవస్థను తీసివేస్తే రైతుకు న్యాయం దక్కుతుంది. అధికారులు రైతులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలి. – ప్రతాప్‌రెడ్డి, ఉద్యాన రైతు, కొత్తపల్లి, రైల్వేకోడూరు

అప్పులు చేసి బొప్పాయికి పెట్టుబడి



బొప్పాయికి పెట్టుబడి అధికంగా ఉంటుంది. దుక్కులు, ఎరువు, పిలకలు, వాటి కూలీలకు అప్పులు చేసి పెట్టుబడి పెట్టాల్సి పెట్టాను. అయినా లాభాలు వస్తాయన్న నమ్మకం లేదు. ధరలు ఉండి పంట బాగా వచ్చినా దళారులు మంచి ఇవ్వరు. అధిక దిగుబడి వచ్చేలా రైతులకు సూచనలు చేయడమే కాక మద్దతు ధర వచ్చేలా ప్రభుత్వం చొరవచూపాలి. –నారాయణరెడ్డి, బొప్పాయి రైతు, పుల్లంపేట

సస్యరక్షణ చర్యలు పాటించాలి



రైతులు బొప్పాయి మొక్కలు నాటే సమయంలో సస్యరక్షణ చర్యలు పాటించాలి. 1.5 అడుగుల గుంతలో కొంత పశువుల ఎరువు, సూపర్ పాస్ఫేట్ 50 గ్రాములు, కార్బొసిరాన్ గ్రాన్యుల్ 5 గ్రాములు వేసి నీరు పెట్టాలి. తరువాత మొక్కలు నాటాలి. తెల్లదోమ, రసం పీల్చే పురుగుల నుంచి కాపాడుకోవడానికి అధికారుల సలహాల మేరకు మందులు పిచికారీ చేయాలి. – వెంకట భాస్కర్, ఉద్యానశాఖ అధికారి, కోడూరు

26 మంది ఎంపీడీఓల బదిలీ

కడప సెవెన్‌రోడ్స్ : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా కడప, అన్నమయ్య జిల్లాలకు బదిలీపై వచ్చిన 26 మంది ఎంపీడీఓలను తిరిగి వారి సొంత జిల్లాలకు బదిలీ చేస్తూ శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీరిని రిలీవ్ చేస్తూ జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి ప్రొసీడింగ్స్ ఇచ్చారు. ఒంటిమిట్ట ఎంపీడీఓ రామచంద్రను అనంతపురం జిల్లాకు పంపారు. అన్నమయ్య జిల్లాలోని సుండుపల్లె, రాయచోటి ఎంపీడీఓలు అమర్‌నాథ్, సురేంద్రనాథ్‌లను చిత్తూరుకు, పుల్లంపేట, గాలివీడు, రామాపురం, చిన్నమండెం, ఓబులవారిపల్లె, సంబేపల్లె, చిట్వేలి మండలాల్లోని ఎంపీడీఓలు నరసింహామూర్తి, శ్రీనివాసులు, ప్రభాకర్, రామకృష్ణ, కుళ్లాయి స్వామి, యోగానందరెడ్డి, నిర్మలాకుమారి, వెంకటరంగారావులను అనంతపురం జిల్లాకు బదిలీ చేయగా, రైల్వేకోడూరులో పని చేస్తున్న కేవీ సుబ్రమణ్యంను కర్నూలు జిల్లాకు పంపారు.

బుద్ధదేవ్ జీవితం ఆదర్శప్రాయం


మాజీ సీఎం బుద్ధదేవ్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం

రాజంపేట రూరల్ : పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి కామ్రేడ్ బుద్ధదేవ్ భట్టాచార్య జీవితం అందరికీ ఆదర్శప్రాయమని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సి.రవికుమార్ అభిప్రాయపడ్డారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ కార్మికులతో కలిసి మాజీ సీఎం బుద్ధదేవ్ చిత్రపటానికి నివాళులర్పించారు. నివాళి అర్పించిన వారిలో మున్సిపల్ కార్మికులు రమణ, ప్రసాద్, లక్ష్మిదేవి, సురేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌లో సౌకర్యాలు కల్పించకుంటే చర్యలు


విద్యార్థినుల సమస్యలను వింటున్న జడ్జి విజయలక్ష్మి

ఓబులవారిపల్లె : కస్తూర్బా గాంధీ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు కనీస సౌకర్యాలు కల్పించకపోతే చర్యలు తప్పవని రైల్వేకోడూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం సాయంత్రం చిన్నఓరంపాడు కస్తూర్బా గాంధీ ఉన్నత పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులను సమస్యలపై ఆరా తీశారు. భోజనంలో పురుగులు వస్తున్నాయని, భోజనం తామే వడ్డించుకోవాలని, పాఠశాలలో ఉన్న వసతి గృహాలు సరిపోకపోవడంతో ప్రతిరోజూ ఇబ్బందులు పడుతున్నామని తెలియజేశారు. అలానే దోమలు అధికంగా ఉండటం, మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉంటున్నాయన్నారు. తమ సమస్యలు పట్టించుకోవడం లేదని జడ్జి దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు స్పందించిన జడ్జి విజయలక్ష్మీ పాఠశాల నిర్వాహకులపై అగ్రహం వ్యక్తం చేసి విద్యార్థులకు కావాల్సిన కనీస సౌకర్యాలను వారం రోజులలోపు ఏర్పాటు చేయాలని లేనిపక్షంలో న్యాయపరమైన చర్యలు ఉంటాయన్నారు. సమస్యలను ఉన్నతస్థాయి అధికారులకు తెలియజేసి వెంటనే పరిష్కారం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఐ చిన్నపెద్దయ్య, న్యాయవాదులు చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం అవసరం


నందలూరు: గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ మస్తానమ్మ


పుల్లంపేట: గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సానే శేఖర్

సుండుపల్లె : ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని రాయవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ శేఖర్ రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గర్భవతికి మంచి పోషకాహారం అవసరమని, పాలు, గుడ్లు, ఆకుకూరలు తీసుకోవాలన్నారు. అలాగే ఐరన్ పాలిక్ ఆసిడ్ మాత్రలు వేసుకోవాలన్నారు. ప్రతి తల్లి కాన్పు అయిన గంట తరువాత బిడ్డకు తల్లిపాలు పట్టడం ద్వారా బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి, అదనపు పోషక విలువలు వస్తాయన్నారు. బిడ్డకు పాలివ్వడం ద్వారా తల్లికి గర్భశాయ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్‌ను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ వీరనారాయణ, సూపర్‌వైజర్ ఎల్లమ్మ, పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నందలూరు : మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాన మంత్రి మాతృత్వ సురక్షిత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 49 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ప్రభుత్వ వైద్యాధికారి కార్తిక్ విశ్వనాథ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేటకు చెందిన ప్రముఖ గైనకాలజిస్ట్ మస్తానమ్మ 25 మంది గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు నిర్వహించారు.

వైద్య పరీక్షలు చేసిన డిప్యూటీ డీఎంహెచ్ఓ

పుల్లంపేట: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం డాక్టర్ మనోజ్ చంద్ర, డిప్యూటీ డీఎంహెచ్ఓ సానే శేఖర్‌ల ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకుంటే శిశుమరణాలు తగ్గించవచ్చన్నారు. అనంతరం ఉచితంగా ఐదు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు పి.మహేష్, కుమారి, ల్యాబ్ టెక్నీషియన్ ప్రసన్న కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా నాగపంచమి వేడుకలు

రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల పరిధిలో శుక్రవారం మహిళలు నాగపంచమి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా వేకువజామునే పుట్టల వద్దకు వెళ్లి ఒక్కపొద్దు చెప్పివచ్చారు. అనంతరం పుట్టలకు దారం చుట్టి పిండి వంటలతో నైవేద్యాలు సమర్పించారు. అనేక మంది మహిళలు పుట్టల చుట్టూ తిరిగి వరపడ్డారు. పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో మహిళల సందడి కనిపించింది. – సాక్షి నెట్‌వర్క్


పుల్లంపేట: అమ్మవారిని దర్శించుకుంటున్న మహిళలు


పుల్లంపేట: పూజలందుకున్న నాగమ్మ


చిట్వేలి: ప్రత్యేక అలంకారంలో సత్యమ్మతల్లి


రాజంపేట టౌన్: పుట్టవద్ద పూజలు చేస్తున్న మహిళలు

ప్రతి పంటను నమోదు చేయాలి

రాజంపేట రూరల్ : పంటను సాగు చేసే ప్రతి రైతు పేరును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని వ్యవసాయశాఖ ఏడీఏ జి.సురేష్‌బాబు సిబ్బందిని ఆదేశించారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో శుక్రవారం సమాచార హక్కు చట్టం-2005 పై మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సమాచార హక్కు చట్టంపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. సమావేశంలో మండల అధికారి జి.రాజకుమారి, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట


ఆలయంలో ప్రతిష్టించిన వినాయకుడి విగ్రహం

పెనగలూరు : మండల కేంద్రం పరిధి కొత్తపల్లిలో శుక్రవారం వినాయక స్వామి విగ్రహ ప్రతిష్ట భక్తి శ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేదపండితులు మంత్రోచ్చరణలు, బ్యాండు వాయిద్యాల మధ్య ఈ విగ్రహ ప్రతిష్ట నిర్వహించారు. ఉపాధ్యాయుడు రమణారెడ్డి ఈ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని నిర్వహించారు. వందల సంఖ్యలో భక్తులు పాల్గొని తమ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆరువేల మందికి అన్నదానం ఏర్పాటు చేసినట్లు దాత రమణారెడ్డి తెలిపారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

నందలూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 200 మంది విద్యార్థులకు ఇన్‌చార్జ్ హెడ్ మాస్టర్ రౌఫ్ బాషా ఆధ్వర్యంలో ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ వి.చంద్రశేఖర్ రెడ్డి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నందలూరు ఎంఈఓ-1 ఎల్.నాగయ్య, ఎంఈఓ-2 సీఆర్.అనంత కృష్ణలు హాజరయ్యారు. పీహెచ్‌సీ అధికారి వి.లక్ష్మయ్య, ఏఎన్ఎం అంజనా దేవి, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఎస్.కృష్ణయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

రాయచోటి అర్బన్ : మున్సిపల్ పరిధిలోని ఏజీ గార్డెన్ కాలనీలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ రాయచోటి కార్యదర్శి ఎస్.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలంటూ శుక్రవారం ఏజీ గార్డెన్ కాలనీ వాసులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజీ గార్డెన్ కాలనీలో భవిష్యత్తులో ప్రజావసరాల కోసం ఉంచిన స్థలాన్ని కొందరు రెవెన్యూ అధికారుల సహకారంతో నకిలీ నివాస స్థలాల పట్టాలు తయారు చేసుకుని కబ్జా చేశారన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్‌కు వినతిపత్రంను సమర్పించారు.

భక్తిశ్రద్ధలతో రాహుకాల పూజలు

రాయచోటి టౌన్ : శ్రీ భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయంలో అమ్మవారికి రాహుకాల పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం అమ్మవారికి ఆలయ ఈఓ డివి రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు అభిషేకాలు, పూజలు నిర్వహించి అమ్మవారిని పూలు, పట్టు వస్త్రాలు, ఆభరణాలతో అలంకరించారు. అలాగే నిమ్మకాయల హారాలతో అలంకరించారు. మహిళలు అమ్మవారికి నిమ్మకాయలపై వత్తులు వెలిగించి హారతులు పట్టారు.

హోటల్‌లో చోరీ

రాజంపేట : పట్టణంలోని భువనగిరిపల్లి ఆర్బీ వద్ద నేషనల్ హైవేపై ఉన్న రాయల్ హోటల్‌లో చోరీ జరిగినట్లు యజమాని తెలిపారు. గురువారం రాత్రి హోటల్ వెనుక భాగంలో తాళం పగులకొట్టి లోనికి ప్రవేశించి హోటల్‌లోని రూ.50 వేలు విలువగల బియ్యం మూటలు, కూల్‌డ్రింక్స్, ఇతర సామాన్లు దొంగలు ఎత్తుకెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. సీసీ కెమెరాలు కూడా తొలగించారని పేర్కొన్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలి


రాజంపేట: డయాలసిస్ సెంటర్‌లో రోగిని సేవలపై వాకబు చేస్తున్న సబ్ కలెక్టర్ నిదియాదేవి

రాజంపేట : ప్రాంతీయ వైద్యశాలలో పేదలకు మెరుగైన వైద్యసేవలందించాలని రాజంపేట సబ్‌కలెక్టర్ వైఖోమ్ నిదియాదేవి ఆదేశించారు. శుక్రవారం సెకండరీ హెల్త్ ప్రాంతీయ వైద్యశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాంతీయ వైద్యశాలలో ఉన్న సౌకర్యాలను రోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం డయాలసిస్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా సురేష్ అనే రోగి వైద్యుడు లేరని, యూరాలజీ వైద్యుడు కూడా లేడని సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. గత మూడు నెలల పింఛను రాలేదన్నారు. నా తల్లి పని చేస్తే నేను చికిత్స చేయించుకోవాలని సబ్‌కలెక్టర్ వద్ద మొరపెట్టుకున్నారు. వెంటనే సంబంధిత మేనేజరును సబ్‌కలెక్టరు ఆరా తీశారు. గతంలో ఈ రోగి తిరుపతి, కడప డయాలిసిస్ చేయించుకునేవారని, ఈ వివరాలతో మళ్లీ కొత్తగా పింఛను కోసం పంపాల్సి ఉంటుందని వివరించారు. త్వరలోనే పింఛను మంజూరవుతుందని రోగికి సబ్‌కలెక్టర్ భరోసా ఇచ్చారు. సబ్‌కలెక్టర్ ఆసుపత్రి తనిఖీ సందర్భంగా సబ్ కలెక్టర్ సూపరింటిండెంట్ గైర్హాజరుపై ఆరాతీశారు. ఆసుపత్రిలో పేద రోగులకు ఎలాంటి సేవలందిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది, వైద్యులు ఎంతమంది ఉన్నారు? కొరత ఉందా అని అడిగి తెలుసుకున్నారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

పుల్లంపేట : రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియా దేవి శుక్రవారం పుల్లంపేట తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు పలు రికార్డులు పరిశీలించి తహసీల్దార్ లక్ష్మీ ప్రసన్న, ఆర్ఐ నవీన్ కుమార్‌లకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయాన్ని తనిఖీ చేసి పంచాయతీలో నీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని, అలాగే వీధిలైట్లు సమస్యలను పరిష్కరించాలన్నారు. తదుపరి హౌసింగ్ ఏఈతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహమూర్తి, హౌసింగ్ ఏఈ పద్మనాభయ్య పాల్గొన్నారు.

డీటీలకు తహసీల్దార్లుగా బాధ్యతలు

రాయచోటి : అన్నమయ్య జిల్లా పరిధిలో ఖాళీగా ఉన్న తహసీల్దార్ల నియామకాలను చేపడుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. శుక్రవారం సాయంత్రం అన్నమయ్య జిల్లా పరిధిలోని డిప్యూటీ తహసీల్దార్ల నియామకం చేస్తూ వారికే పూర్తి స్థాయి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) అప్పజెప్పారు. జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి విడుదల చేసిన ఉత్తర్వులు ఇలా ఉన్నాయి..

డిప్యూటీ తహసీల్దార్	తహసీల్దార్
రామాంజులు	రామాపురం(ఎఫ్ఏసీ)
లక్ష్మీప్రసన్న	లక్కిరెడ్డిపల్లె(ఎఫ్ఏసీ)
వెంకటేశ్వర్లు	సంబేపల్లె(ఎఫ్ఏసీ)
అరవింద్ కిశోర్	పుల్లంపేట(ఎఫ్ఏసీ)
పీర్‌మున్నీ	ఓబులవారిపల్లి(ఎఫ్ఏసీ)
నరసింహకుమార్	సూపరింటిండెంట్ కో-ఆర్డినేషన్ సెక్షన్ కలెక్టరేట్(ఎఫ్ఏసీ)
రవీంద్రనాయక్	కలెక్టరేట్ డీటీ
రవికుమార్	రాయచోటి డిప్యూటీ తహసీల్దార్
సిద్ధేశ్వరరావు	కలెక్టరేట్ డిప్యూటీ తహసీల్దార్
రెడ్డన్న	సుండుపల్లె డిప్యూటీ తహసీల్దార్
ఫజలుల్లా	కలెక్టరేట్ బీసీఎస్ఓ డిప్యూటీ తహసీల్దార్
ఫైరోజ్‌ఖాన్	కలెక్టరేట్ బీసీఎస్ఓ డిప్యూటీ తహసీల్దార్

పశువులకు టీకాలు వేయించాలి


రైతులకు గడ్డివిత్తనాలు పంపిణీ చేస్తున్న పశుసంవర్ధక శాఖ అధికారి మాలకొండయ్య

చిన్నమండెం : ప్రభుత్వం అందించే పలు రకాల ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు డా.మాలకొండయ్య తెలిపారు. శుక్రవారం చిన్నమండెం పశువైద్యశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి 1950 కేజీల మొక్కజొన్నలు, 1750 కేజీల గడ్డిజొన్నలు మంజూరయ్యాయన్నారు. 75 శాతం రాయితీతో మండలంలోని రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అదే విధంగా ఈ నెల 20వ తేదీ నుంచి పశువులకు గాలికుంటు టీకాలు, ఈసుకపోయే వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు తెలిపారు. రైతు సోదరులు తమ పశువులకు టీకాలు తప్పక వేయించాలన్నారు. అదే విధంగా మండలానికి 50 పశువుల పాకలు లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయించిందని, అర్హత కలిగిన రైతులు షెడ్లకు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి డా.గణేష్, పశువైద్య శాఖ సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

జీఓ నం.117ను ప్రభుత్వం రద్దు చేయాలి

రాయచోటి టౌన్ : విద్యా వ్యవస్థలో గత ప్రభుత్వం అమలు చేసిన జీఓ నం.117ను రద్దు చేయాలని ఆపస్ (ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం) జిల్లా నాయకులు జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రసాద్‌రెడ్డికి వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు నరసింహులు మాట్లాడుతూ గత ప్రభుత్వం చేపట్టిన జీఓ నంబర్ 117 వలన విద్యావ్యవస్థకు నష్టం కలిగించిందని దీనిని రద్దు చేయాలని కోరారు. అలాగే 3,4,5వ తరగతులను మళ్లీ ప్రాథమిక పాఠశాలలో కలపాలని కోరారు. ఉపాధ్యాయుల పదోన్నతులు వెంటనే చేపట్టాలని సూచించారు. అలాగే ప్రాథమిక పాఠశాలలో 40 మంది విద్యార్థుల సంఖ్య దాటితే మూడో ఉపాధ్యాయుడిని కేటాయించాలని కోరారు. అలాగే తెలుగు మీడియం కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షులు పరుశురాం, రాష్ట్ర కార్యదర్శి మధుమతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగేశ్వరావు, జిల్లా ఉపాధ్యక్షులు రామాంజుల రెడ్డి, బాలాజీ, రాజా, మల్లికార్జున తదిదతరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

రైల్వేకోడూరు అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం రెండు, నాలుగు సెమిస్టర్ ఫలితాలలో స్థానిక సాయి డిగ్రీ కాలేజీ బీకాం కంప్యూటర్స్, బీజెడ్‌సీ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు శుక్రవారం ప్రిన్స్‌పల్ పెంచలయ్య తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయన అభినందించారు. భవిష్యత్తులో మరింత రాణించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డైరక్టర్ శ్రీనివాసులు, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.